## క్లుప్తంగా

### 1న గ్రామసభ

భైంసారూరల్: మండలంలోని గుండేగాం గ్రామానికి పునరావాసం కల్పించేందుకు జూన్ 1న గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బాధితులకు అందించే పరిహారంపై గ్రామస్తులకు నోటీసులు అందించామని.. అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో తెలపాలన్నారు. ఈ నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ముంపు బాధితులు ఎక్కడున్నా.. గ్రామసభకు హాజరవాలని కోరారు.

### ప్రజాఫిర్యాదుల విభాగానికి మూడు దరఖాస్తులు

తానూరు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగానికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, ఐకేపీ ఏపీఎం నారాయణ్‌రెడ్డి, పశువైద్యాధికారి గోపాల్ మహాజన్ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవం



గోదావరి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం కొనసాగుతోంది. మూడో రోజైన సోమవారం భక్తులు ఉత్సవమూర్తి విగ్రహంతో గోదావరికి వెళ్లి గంగస్నానం చేయించారు. అనంతరం పుట్టదని, లందకాడికి వెళ్లి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఒగ్గు కథ కొనసాగిస్తున్నారు. గౌడశెట్టి పూజారుల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపు జరిపారు.

### ఉమామహేశ్వరుడికి పూజలు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. చిప్ప సంజీవ్ ఆధ్వర్యంలో స్వామివారికి అన్నపూజ నిర్వహించారు. అభిషేకం, అలంకరణ, హారతిపూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: మండలంలోని గన్నోరాలో సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివపంచాయతన, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ దేవతాప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, బీజేపీ నాయకులు మోహన్‌రావుపటేల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, సర్పంచ్ లావణ్య కిష్టయ్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, రామ్‌రెడ్డి, పాలకులు, నాయకులు పాల్గొన్నారు.

### 'బ్రిజ్ భూషణ్‌ను శిక్షించాలి'




మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం నిరసన తెలియజేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌పై గతంలో అనేక కేసులు, ఫిర్యాదులు ఉన్నాయన్నారు. క్రీడాకారులతో అనుచితంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. అయినా కేంద్ర ప్రభుత్వం వెనకేసుకురావడంతో మహిళా క్రీడాకారులపై అతని ఆగడాలు తీవ్రమయ్యాయన్నారు. ప్రధాని వైఖరి రేపిస్టులు, మహిళలను లైంగికంగా వేధించేవారిని కాపాడేలా ఉందని ఆరోపించారు. ఇది ఏమాత్రం క్షమార్హం కాదన్నారు. వెంటనే భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో పద్మ, కవిత, రాజమణి, పుష్ప, గంగమణి పాల్గొన్నారు.

### మంత్రి పరామర్శ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ కొండూరి కిషన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈసందర్భంగా సోమవారం ఆయన కుటుంబ సభ్యులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆదాయానికి గండి..!

- ఇసుక డంపులపై కానరాని చర్యలు
- కొనసాగుతున్న అక్రమదందా
- అధికారుల సమన్వయంతోనే దందాకు అడ్డుకట్ట

**వచ్చేది వర్షాకాలం కావడంతో అక్రమార్కులు ముందుగానే ఇసుకను భారీగా డంప్ చేస్తున్నారు. వాగుల నుంచి పొక్లెయిన్లతో ఇసుక తరలించి ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమదందా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారుల సమన్వయంతోనే అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.**



ఖత్‌గాం శివారులో డంప్ చేసిన ఇసుక కుప్పలు

భైంసాటౌన్: జిల్లాలో ఇసుక అక్రమదందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. అక్రమార్కులు ఇసుకను అమ్ముకుని రూ.లక్షలు గడిస్తుండగా, శాఖల మధ్య సమన్వయలోపంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇసుక అక్రమ తరలింపు నియంత్రణకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో డీఎల్‌ఎస్‌సీ(డిస్ట్రిక్ లెవెల్ సాండ్ కమిటీ) ఏర్పాటు చేసి నూతన మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఒక్క ట్రాక్టర్ (3 క్యూబిక్ మీటర్లు) ఇసుక తరలించేందుకు రూ.800 తహసీల్దార్ పేరిట డీడీ చెల్లించాలని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అది కూడా ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు తహసీల్దార్ అనుమతితో ఇసుక తరలించాలి. లేకుంటే మొదటిసారి పట్టుబడితే రూ.5వేలు, రెండోసారి పట్టుబడితే రూ.15వేలు జరిమానా విధించాలని.. ఒకవేళ ఇసుక తోడే యంత్రాలు పట్టుబడితే మొదటిసారి రూ.50వేలు, రెండోసారి రూ.లక్ష జరిమానా విధించాలని ఆదేశాలున్నాయి. కానీ కొన్ని ట్రాక్టర్లు పలుమార్లు పట్టుబడినా రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు జరిమానాలు విధించకుండా వదిలేస్తున్నట్లు విమర్శలున్నాయి.

**తరలించేది వందల్లో.. చెల్లించేది పదుల ట్రాక్టర్లకే..**

గత మార్చి నెలలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి సాండ్ కమిటీలో నూతన మార్గదర్శకాలు జారీ చేయడంతో ఆయా మండలాల్లో తహసీల్దార్లు ఇసుక వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. దీంతో కొందరు నామమాత్రంగా ఒక డీడీ చెల్లించి, దాని చాటున పదుల సంఖ్యలో ఇసుక తరలించి డంప్ చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా, పదుల సంఖ్యలో మాత్రమే డీడీలు చెల్లిస్తున్నారు. ఉదాహరణకు.. భైంసా మండలంలో మార్చి నెలలో రూ.68,070, ఏప్రిల్‌లో రూ.48,040 ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఈ లెక్కన నెలలో వంద ట్రాక్టర్లకు మించి తరలించలేదని తెలుస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ఒక్కరోజులోనే వందల సంఖ్యలో తరలించి, తూతూమంత్రంగా డీడీలు చెల్లించి ఇసుక తరలిస్తున్నారని పైలెక్కలను బట్టి అర్థం చేసుకోవచ్చు.

**డంప్‌లపై దృష్టి ఏది..?**

భైంసా పట్టణంలోని పలు ఖాళీ ప్రదేశాలతోపాటు శివారులోని రాహుల్‌నగర్, ఖత్‌గాం రోడ్డు, మాటేగాం, బాబుల్‌గాం, తదితర ప్రాంతాల్లో కుప్పలుతెప్పలుగా ఇసుక డంప్‌లు కనిపిస్తున్నాయి. రాత్రివేళ వాగుల నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తీసుకొచ్చి ఆయా ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. తర్వాత రోజంతా డంప్‌ల వద్ద నుంచి ఇసుకను తరలించి విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

**సొంత శాఖల బాధ్యతల్లోనే అధికారులు..**

ఇదిలా ఉండగా.. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సాండ్ కమిటీలో ఆయా శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. కానీ వారు సొంత శాఖల బాధ్యతల్లో నిమగ్నమై ఇసుక అక్రమ తరలింపు నియంత్రణపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. తమను అడ్డుకునే వారే లేరన్న చందంగా వ్యవహరిస్తూ వాగుల్లో పొక్లెయిన్లతో ఇసుకను తోడేస్తూ ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

### ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

భైంసారూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఖత్‌గాం, కామోల్ గ్రామాల మధ్య ఉన్న వాగును సందర్శించారు. ఇసుక అక్రమ రవాణా కోసం ఏర్పాటు చేసుకున్న దారులను మూసివేయించారు. ఆయన వెంట పలువురు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడి

- రైతుల ధర్నాలో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి
- ఫోన్‌లో కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



జామ్‌లో రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: వారం రోజుల్లో రైతుల సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం, బస్తాకు మూడుకిలోలు అదనంగా తూకం, ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం మండలంలోని జామ్, చించోలి(బి) గ్రామాల రైతులు నిర్మల్–స్వర్ణ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ధర్నా విషయం తెలుసుకున్న మహేశ్వర్‌రెడ్డి అక్కడకు వచ్చి రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. జామ్ గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, ఎంఆర్‌ఐ ముంతాజ్ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామని చెప్పినా రైతులు వినిపించుకోలేదు. దీంతో రోడ్డుపై రెండున్నర గంటలు వాహనాలు నిలిచిపోయాయి.

**ఒక్క లారే తరలించారు..**

ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పెద్ద పంచాయతీ అయిన జామ్ గ్రామం నుంచి ఇప్పటివరకు ఒకే లారీలో ధాన్యంబస్తాలు తరలించారన్నారు. కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలు రాక అలాగే ఉంచారన్నారు. అధికారులు, నాయకుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో మహేశ్వర్‌రెడ్డి కలెక్టర్ వరుణ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల ఇబ్బందులను, కొనుగోలు కేంద్రం వద్ద ఎదురవుతున్న సమస్యలను వివరించారు. స్పందించిన కలెక్టర్ వారం రోజుల్లో ధాన్యం కొని తరలిస్తామన్నారు. కొన్న వెంటనే తూకం పట్టీ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామనడతో రైతులు ఆందోళన విరమించారు. చించోలి(బి)లో ఆర్టీఓ స్రవంతి రాస్తారోకో చేస్తున్న రైతులను సముదాయించారు. చాలా చోట్ల లారీల సమస్య ఉందని.. సమస్య పరిష్కరిస్తామనడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ తరలిన వీవోఏలు



కుంటాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న వీవోఏలు

కుంటాల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాకు కుంటాల మండలంలోని ఆయా గ్రామాల వీవోఏలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వీవోఏల సంఘం మండల కన్వీనర్ మహేష్, వీవోఏలు దేవన్న, సంపత్, ఏసురత్నం, గంగాధర్, గజ్జారాం, అసీనా, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: సమస్యల పరిష్కారంలో భాగంగా వీవోఏలు సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాధర్నాకు ఖానాపూర్ డివిజన్ పరిధిలోని పలువురు వీవోఏలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ డిమాండ్లను పరిష్కరించాలని.. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు వీవోఏలు లావణ్య, రవీందర్, శ్రీకాంత్, జ్యోతిరాం, వనిత, స్వరూప, మౌనిక, పల్లవి, రాజకళ, శ్రీలత, రాజేశ్వర్, భీమయ్య, కవిత, తదితరులు ఉన్నారు.

**అరెస్టులు అప్రజాస్వామికం**

నర్సాపూర్(జి): అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని కాంగ్రెస్ నాయకులు, సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, న్యాయవాది మల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు వెళ్తున్న మండలంలోని వీవోఏలను నర్సాపూర్(జి) పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం వీవోఏలను వదిలిపెట్టారు.

### నేడు జీలుగ విత్తనాల పంపిణీ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంతోపాటు కనకాపూర్ గ్రామ ఆగ్రోస్‌లో జీలుగ విత్తనాల పంపిణీ మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30కిలోల బ్యాగ్ ధర రూ.843 ఉందని.. అవసరం ఉన్న రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌తో సంప్రదించాలని ఆయన సూచించారు.

**ముధోల్ మండలంలో..**

ముధోల్: మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు పట్టదార్ పాసుపుస్తకం, ఆధార్‌తో టోకెన్ తీసుకోవాలని సూచించారు.

**లోకేశ్వరం మండలంలో..**

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీపై 30 కేజీల జీలుగ బ్యాగు ధర రూ.843 ఉందని.. ఓ బ్యాగు రెండురన్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### కంటివెలుగు ప్రారంభం

ముధోల్: మండలంలోని విఠోలి గ్రామంలో సోమవారం సర్పంచ్ సత్తయ్యగౌడ్ రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలున్న వారికి అద్దాలు, మందులు అందిస్తామని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ సాయినాథ్, వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, శంకర్ తదితరులున్నారు.

**నచ్చన్‌ఎల్లాపూర్‌లో..**

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌లో సోమవారం సర్పంచ్ బొడ్డు గంగన్న కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్నవారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గోపాల్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్ తదితరులు ఉన్నారు.

# కార్మికులకు వేతనాలు పెంచాలి



సోన్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



లక్ష్మణచాందలో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సోన్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేసి ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఎనిమిది గంటల పనితోపాటు సెలవు దినాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.రాజేశ్వర్, నర్సయ్య, జువ్వన్న, పోశెట్టి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: ప్రాణాలను పణంగా పెట్టి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం గౌరవ వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవో శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. నెలకు రూ.19వేలు, రూ.10 లక్షల బీమాతోపాటు మృతి చెందితే అంత్యక్రియల కోసం రూ.30 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీ కార్మికులు చిన్న భీమన్న, రాజేశ్వర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్ | ప్రమాదకరంగా రోడ్డు



ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామం నుంచి దిలావర్‌పూర్ పంట పొలాలకు వెళ్లే కాలువ రోడ్డు ప్రమాదకరంగా మారింది. చెరువు అలుగు, వాగు నీటితో ప్రవహించే కాలువ మధ్యలో కోతకు గురైంది. నెలరోజులుగా ఎవరూ పట్టించుకోవడం లేదని. .వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రవినాయక్, ఇరిగేషన్ జేఈ, ఫోన్: 99497 05373

# ర్యాలీకి లింగాయత్‌లు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: వీరశైవ లింగాయత్ లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని వీరశైవ లింగాయత్ లింగ బలిజ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.సంగమప్ప అన్నారు. జూన్ 4న హైదరాబాద్‌లో నిర్వహించే లింగ బలిజల మహార్యాలీకి సంబంధించిన పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సీఎం కేసీఆర్ వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.పదివేల కోట్లు కేటాయించాలని కోరారు. ర్యాలీలో 33 జిల్లాల లింగాయత్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప, కోశాధికారి దినేష్, సతీశ్, యశ్వంత్‌పటేల్, శివప్ప, రాజశేఖర్, సోమేశ్వర్, డాక్టర్ సుభాష్‌రావు, పండరినాథ్ పటేల్, రామేశ్వర్ పటేల్, సాయిపటేల్ పాల్గొన్నారు.

# దశాబ్ది వేడుకలు జయప్రదం చేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: బంగారు తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం దశాబ్ద కాలంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలిపేలా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వచ్చే నెల 4న జిల్లాకు సీఎం కేసీఆర్ రానున్నారని.. వారి పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుప్పాల శంకర్, అంకం రాజేందర్, కలీల్, సురేశ్, శ్రావణ్, చరణ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కుభీర్: దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ తూము లక్ష్మీబాయి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గురుకులాలకు విద్యార్థులు ఎంపిక

కుంటాల: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షా ఫలితాలు సోమవారం ఫలితాలు విడుదలయ్యాయి. మండలంలోని పెంచకల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రుషిత్, వైష్ణవి, నేహికారెడ్డి, శ్రీవిద్య, విద్యార్థులు సోఫినగర్, భైంసా, ముధోల్ గురుకులాల్లో సీట్లు సాధించారు. పాఠశాల చైర్మన్ బాబారావ్, హెచ్‌ఎం విద్యార్థులను అభినందించారు.

ఖానాపూర్: తెలంగాణ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన టీజీ సెట్ ఫలితాల్లో మండలంలోని బాదనకుర్తి, పాతఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాదనకుర్తికి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం రమేశ్, ఎస్‌ఎంసీ చైర్మన్ పాదం రాజేశ్వర్ తెలిపారు. పాతఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం మారుతిస్వామి తెలిపారు.

# ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

పెంబి: రైతులు వ్యవసాయంతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని పస్పుల పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ, కోలాంగూడ గ్రామాల్లో సోమవారం రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయంపై అవగాహన కల్పించారు. గిరిజనులు గిరిరాజ, వనరాజ వంటి పెరటి కోళ్లను పెంచుకుంటే రెండు, మూడు నెలల్లో మంచి ఆదాయం పొందవచ్చన్నారు. మిల్లిఫెరా జాతి తేనెటీగల పెంపకం ద్వారా 45 రోజుల్లో ఒక్కో బాక్సుకు రూ.వెయ్యి నుంచి రెండు వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సహదేవ్, కార్యదర్శి రియాజ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



**హరిత స్వాగతం**

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామంలో ప్రవేశద్వారం నుంచి పచ్చదనం స్వాగతం పలుకుతోంది. హరితహారంలో భాగంగా దారి పొడవునా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడనిస్తూ.. ఆహ్లాదం పంచుతున్నాయి.

### సన్మానం

నర్సాపూర్(జి): నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన టీ.రవీందర్‌ను సోమవారం నర్సాపూర్(జి) గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గోపిడి గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, మహేందర్, వినాయక్, రఘు, మోహినొద్దీన్ ఉన్నారు.